# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 18 జనవరి , 2026 | పేజీలు :06


## డైలీ మార్కెట్ యార్డు ప్రారంభం



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం నగరపాలక పరిధి యైటింక్లయిన్‌కాలనీలో నూతనంగా రూ.30 లక్షలతో నిర్మించిన డైలీ మార్కెట్ యార్డు, సిసి రోడ్డును రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మార్కెట్‌లోని వ్యాపారులను కలిసి మాట్లాడారు. సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజిరెడ్డి, రాజేష్, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతికి కవలలుగా

## ప్రజల కష్టాన్ని దోచుకున్న బిజెపి, బిఆర్ఎస్

### డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగరంలో పది సంవత్సరాలు ఇటు బిఆర్ఎస్ అటు భారతీయ జనతా పార్టీ, కేంద్రంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నారని, అవినీతి కవలుగా ఉండి అభివృద్ధిని చేయకుండా నగర ప్రజల కష్టార్జితాన్ని దోచుకున్నారని డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆరోపించారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ లతో కలిసి శనివారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో 90శాతం పైగా మేం గెలుచు కోబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం పైగా సర్పంచ్ లను గెలుచుకున్నామని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా 90 శాతానికి తగ్గకుండా మెజార్టీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతుందన్నారు. గత ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు 30 శాతానికి దాటలేదని, బిజెపి, బిఆర్ఎస్ పార్టీ ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకున్నా, పరోక్షంగా పొత్తు పెట్టుకున్నా 10 శాతానికే పరిమితం అవుతారన్నారు. రెండు పార్టీలు కలిసి కరీంనగర్ నగరాన్ని ధ్వంసం చేసి అవినీతికి అడ్డగా మార్చారని, కార్పొరేషన్ లో పర్సంటేజీ కల్చర్ తో బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ఏ విధంగా దోచుకున్నారో కరీంనగర్ ప్రజలందరికీ తెలుసని అన్నారు. స్మార్ట్ సిటీ పనులలో, కేబుల్ బ్రిడ్జి నిర్మాణాలను జేబులు నింపుకోవడానికే చేశారని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ల భూకబ్జాల గురించి అందరికి తెలుసని, గతంలో సిపి అభిషేక్ మహంతి ఉన్నన్ని రోజులు బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు కాలు అడుగు బయట పెట్టడానికి భయపడ్డారని, మళ్లీ అలాంటి నాయకులే మరో అవతారంతో బిజెపిలోకి వెళ్తున్నారని విమర్శించారు. అవినీతి రూపం మారుతుంది తప్ప అవినీతి మారలేదన్నారు. నగరంలోని డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మేనేని రాజనర్సింగారావు, ముద్దం తిరుపతి, ముద్దసాని రంగన్న, బానోతు శ్రవణ్ నాయక్, కొర్వి అరుణ్ కుమార్, రామిడి రాజిరెడ్డి, సురేందర్ రెడ్డి, లింగంపల్లి బాబు, ముద్దం తిరుపతి, కుంభాల రాజ్ కుమార్, సిరికొండ శివప్రసాద్, నెల్లి నరేష్, కంకణాల అనిల్ కుమార్, ఇరుమళ్ళ మల్లేశం, ఇమ్రాన్, పెంట శేఖర్, పర్వత మల్లేశం, అందశంకర్, దీకొండ శేఖర్, బత్తుల రాజకుమార్, మంద మహేష్, సత్తినేని శ్రీకాంత్, దుబాసి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో హల్‌చల్

### భూ సమస్య పేరుతో హైటెన్షన్ డ్రామా *మళ్లీ స్తంభమెక్కిన బ్రహ్మణపల్లి వాసి *అంధకారంలో ఎడపల్లి....



**ప్రజాపక్షం/ఎడపల్లి:** తన భూ సమస్య పరిష్కారం కావట్లేదన్న నేపంతో ఒక వ్యక్తి పదే పదే విద్యుత్ స్తంభం ఎక్కుతూ అధికారులను, ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నాడు. బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన నాగభూషణం శనివారం మరోసారి ఎడపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి హంగామా సృష్టించడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎడపల్లి మండలంలోని బ్రహ్మణపల్లికి చెందిన నాగ భూషణం విద్యుత్ శాఖలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. గతంలో తన మామ పేరిట ఉన్న భూమిలో కొంత భాగం విక్రయించగా, మిగిలిన ఏడు గుంటల భూమిని ధరణి పోర్టల్‌లో తన భార్య పేరు మీదకు మార్చాలని ఆయన కోరుతున్నాడు. ఈ విషయమై అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో, నిరసనగా బుధవారం నాడు తొలిసారి స్తంభమెక్కాడు. అప్పట్లో పోలీసులు హామీ ఇవ్వడంతో దిగి వచ్చాడు. కానీ శనివారం నాడు మద్యం మత్తులో బ్రహ్మణపల్లిలో గల తన అత్తవారింటికి వెళ్లి ఇంటి తాళాలు పగులగొట్టాడు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన నాగభూషణం మద్యం సేవించి శనివారం మళ్లీ పోలీస్ స్టేషన్ ముందే ఉన్న కరెంట్ స్తంభం ఎక్కి నిరసన తెలిపాడు. నాగభూషణం స్తంభం ఎక్కిన ప్రతిసారి భద్రతా కారణాల దృష్ట్యా విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి వస్తుంది. ఎడపల్లి మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలకు గంటల తరబడి విద్యుత్ నిలిచిపోయింది. గృహ వినియోగదారులు, వ్యాపారులు కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం అందుకున్న స్థానిక సర్పంచి కందగట్ల రాంచందర్, రూరల్ సిఐ విజయ్ బాబు, ఎస్ఐ రమ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. నాగభూషణంతో చర్చలు జరిపి, ఆయనను శాంతింప చేసి కిందకు దించారు. మద్యం మత్తులో ఇలాంటి ప్రాణపాయ చర్యలకు పాల్పడటం సరికాదని పోలీసులు హెచ్చరించారు. తాగిన మైకంలో ఇలా పదేపదే స్తంభం ఎక్కి ఊరిని ఇబ్బంది పెట్టడం సరికాదని, అసహనంగా ఉంటే చట్టపరంగా పోరాడాలి తప్ప, ఇలా ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తేనే ఇలాంటి స్తంభం డ్రామాలకు తెరపడుతుందని అటు అధికారులు, ఇటు ప్రజలు భావిస్తున్నారు.

## కులమతాలకతీతంగా వేములవాడలో అభివృద్ధికి అడుగులు



**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో కుల మతాలకతీతంగా అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నేతృత్వంలో వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 43 కుల సంఘాలకు ఒక్కో సంఘానికి ఆరు లక్షల చొప్పున నిధులను మంజూరు చేయించారు. తాజాగా శనివారం పట్టణం లోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మూల వాగులో గల గంగా భవాని దేవస్థానానికి వెళ్లే రహదారి బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి 80 లక్షల నిధులు మంజూరు చేయించారు. గత కొన్ని దశాబ్దాల కాలంగా పెండింగ్ లో ఉన్న ముస్లిం మైనారిటీల షాదీ ఖానా పునర్నిర్మాణ పనుల కోసం సైతం శంకుస్థాపన చేశారు. షాది ఖానా పునర్నిర్మాణం కోసం 80 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. వీటితో పాటు మునిసిపాలిటీ పరిధిలోని క్రిస్టియన్ సోదరుల విజ్ఞప్తి మేరకు క్రిస్టియన్ భవన్ నిర్మాణం కోసం కోటి 30 లక్షల నిధులు మంజూరు చేశారు. బడుగు బలహీన వర్గాల (బీసీ)భవన్ కోసం కోటి 30 లక్షల రూపాయలను విడుదల చేశారు. కోటిన్నరతో తిప్పాపురం జంక్షన్ ను పనులను ప్రారంభించారు. 6 కోట్ల నిధులతో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సిసి రోడ్ల నిర్మాణం కొనసాగుతోంది. ప్రధాన రహదారి రోడ్ల వెడల్పు పనులు స్పీడ్ అందుకున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన తనను ఎమ్మెల్యేగా గెలిపించిన మీ అందరికీ రుణపడి ఉన్నారని అన్నారు ఎన్నికల్లో నేను చేసిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నానన్నారు గత పది సంవత్సరాల కాలంలో మున్సిపాలిటీలో బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు చేసిన పనులు ఈ రెండు సంవత్సరాల ప్రజాపాలన మా ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను పరిశీలించి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ లతోపాటు గంగపుత్ర సంఘం నాయకులు, ముస్లిం మత పెద్దలు, కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు రాసే ప్రతి అక్షరం ప్రజలపక్షం

### క్యాలెండర్ ఆవిష్కరణలో అధికారులు,ప్రజాప్రతినిధులు



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** జర్నలిస్టులు రాసే ప్రతిఅక్షరం ప్రజలపక్షాన ఉండాలని ఎల్లారెడ్డిపేట ఎంఆర్ఒ సుజాత,ఎంపిడిఒ సత్యయ్య అన్నారు.శనివారం ప్రజా పక్షం జాతీయదినపత్రిక 2026 కాలమానిని అధికారులు,ప్రజాప్రతినిధులు ఆవిష్కరించి మాట్లాడారు.సమాజంలో జరుగుతున్న అవినీతి,అక్రమాలను నిజాలను నిర్భయంగా రాయాలని అన్నారు.ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా జర్నలిస్టులు ఉంటారని ఫోర్త్‌పిల్లర్‌గా పని చేసేవారి పట్ల గౌరవం ఉంటుందని చెప్పారు.క్యాలెండర్‌ను ఆవిష్కరించిన వారిలో తాజామాజీ జెడ్‌పిటిసి చీటిలక్ష్మ ణ్‌రావు,గొల్లపల్లి సర్పంచ్ కొండరమేష్‌గౌడ్,రాగట్లపల్లి ఉపసర్పంచ్ మందాటిరాము ప్రజాప్రతినిధులు,వాణిజ్యవేత్తలు ఉండగా గన్నమనేని సుధాకర్ రావు, వివిధ పత్రికా జర్నలిస్టులు రవికాంత్‌గౌడ్,కట్టెలబాబు వెంటున్నారు.

## బిఆర్ఎస్‌లోకి చేరికలు



**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్ నగరం లో ని 42వ డివిజన్ కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గంద్ర రఘునాథరావు శని వారం రోజున బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చు కున్నారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి కరీంనగర్ ఎ మ్మెల్యే గంగుల కమలాక ర్ ఈ కార్యక్రమం ఎమ్మెల్యే గంగుల నివాసం లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గం గుల వెంట బి ఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హ రిశంకర్, మాజీ కార్పొరేటర్లు వ ంగపల్లి రా జేందర్ రావు, బోనాల శ్రీకాంత్, గ ందే మ హేష్, దిండిగాల మహేష్, ఎడ్ల అశోక్, వాల రమణారావు, నాంపల్లి శ్రీనివాస్, నాయ కులు సుంకిశాల సంపత్ రావు, జువ్వాడి రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి మాజీ కార్పొరేటర్

**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్‌లో కాం గ్రె స్ పార్టీలో రోజురోజుకు భారీగా చేరికలు సాగుతున్నాయని కరీంనగర్ ప్రజల చూపు కాంగ్రెస్ వైపే ఉన్నదని మేయర్ పీఠం కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. శని వారం సా యంత్రం వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యం లో 19 వ డివిజన్ కు చెందిన బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ సుధ గోని మాధవి కృష్ణ గౌడ్ కాంగ్రెస్ లో చేరారు. వారికి రాజేందర్ రావ్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వా నించారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ పెద్ద ఎత్తిన వెలిచాల ప్రజా కార్యాలయంలో దాదాపు 500 మంది బీఆ ర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారని కరీంనగర్ కార్పొరేషన్ పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## క్రీడా స్ఫూర్తి ఉంటే ఏదైనా సాధించవచ్చు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** యువతలో క్రీడా స్ఫూర్తి ఉంటే భవిష్యత్తులో ఏదైనా సాధించ వచ్చునని టిపిసిసినాయకులు జువ్వడి కృష్ణా రావు, మెట్పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మొగిలి పేట గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వ ర్యంలో ఏర్పాటుచేసిన క్రీడల పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడా కారులకు బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం మాట్లాడుతూ యువత క్రీడలను అలవర్చుకోవడం ద్వారా చెడు అలవాట్లకు దూరంగా ఉంటారని క్రీడలు మానసిక ఉల్లాసానికి ఉత్సాహానికి ఎంతో దోహదపడతాయని సూచించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడా పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియా డారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ ఎస్సై కోసన రాజు సర్పంచ్ గోల్కొండ కళా రమేష్, ఉప సర్పంచ్ దండవేణి రాజేందర్, పంచాయతీ కార్యదర్శి సౌజన్య,బిసిసెల్ మం డల అధ్యక్షుడు వరద సురేష్,పంచా యతీ పా లకవర్గ సభ్యులు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు,క్రీడాకా రులుపాల్గొన్నా రు.

# కరీంనగర్ కార్పొరేషన్‌లో 66 డివిజన్ల వారీగా రిజర్వేషన్ల జాబితా

**ప్రజాపక్షం/కరీంనగర్:**కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజ న్ల (వార్డు) రిజర్వేషన్లను అధికారులు అధికారికంగా ఖరా రు చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలక మైన ఈ ఘట్టం పూర్తికావడంతో నగరంలో రాజకీయ వేడి రాజుకుంది. జనాభా నిష్పత్తికి అనుగుణంగా ఎస్‌సి, ఎస్ టివర్గాలకు డివిజన్లను కేటాయించారు. అలాగే బిసి వర్గాల కు అధిక ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, మహిళలకు పెద్ద ఎత్తున స్థానాలను కేటాయించడం గమనార్హం. ఈ మార్పులతో గతంలో ఆధిపత్యం చెలాయించిన పలువురు సీనియర్ కార్పొరేటర్లు తమ సొంత డివిజన్లలో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోగా, కొత్త ముఖాలకు, ముఖ్యంగా మ హిళా నేతలకు అవకాశం లభించింది. డివిజన్ల వారీగా రిజ ర్వేషన్ల వివరాలు ఇలా డివిజన్1: బిసి మహిళ, డివిజన్2: జనరల్, డివిజన్3: జనరల్ మహిళ, డివిజన్4: ఎస్సీ, డివి జన్5: బిసి మహిళ, డివిజన్6: జనరల్,డివిజన్7: జనరల్ మహిళ,డివిజన్8: జనరల్, డివిజన్9: జనరల్ మహిళ డివి జన్10: బిసి , డివిజన్11: జనరల్ మహిళ, డివిజన్12: జనరల్ మహిళ, డివిజన్13: జనరల్ మహిళ, డివిజన్14: బిసి , డివిజన్15: జనరల్ మహిళ, డివిజన్16: జనరల్, డివిజన్17:బిసి మహిళ, డివిజన్18: జనరల్, డివిజన్19: జనరల్ మహిళ, డివిజన్20: ఎస్‌సి, డివిజన్21: జనరల్, డివిజన్22: జనరల్, డివిజన్23: జనరల్, డివిజన్24: జనరల్, డివిజన్25: ఎస్‌సి, డివిజన్26: జనరల్, డివిజన్ 27: ఎస్‌సి మహిళ, డివిజన్28: ఎస్‌టి(జనరల్), డివిజన్ 29: ఎస్‌సి, డివిజన్30: ఎస్‌సి మహిళ, డివిజన్31: బిసి , డివిజన్32:బిసి , డివిజన్33: బిసి మహిళ, డివిజన్34: బిసి , డివిజన్35: బిసి మహిళ, డివిజన్36:బిసి , డివిజన్ 37: బిసి , డివిజన్38: జనరల్ మహిళ, డివిజన్39: బిసి ,డివిజన్40: జనరల్ మహిళ, డివిజన్41: జనరల్ మహిళ, డివిజన్42: జనరల్, డివిజన్43: బిసి మహిళ, డివిజన్44: జనరల్ మహిళ, డివిజన్45: బిసి మహిళ, డివిజన్46: బిసి , డివిజన్47: బిసి మహిళ, డివిజన్48: బిసి మహిళ, డివిజన్49: జనరల్ మహిళ, డివిజన్50: జనరల్, డివిజన్ 51: జనరల్, డివిజన్52: జనరల్ మహిళ, డివిజన్53: ఎస్‌సి మహిళ, డివిజన్54:బిసి మహిళ, డివిజన్55: జన రల్ మహిళ, డివిజన్56: జనరల్ మహిళ, డివిజన్57: జన రల్ మహిళ, డివిజన్58: బిసి , డివిజన్59: బిసి , డివిజన్ 60: జనరల్ మహిళ, డివిజన్61: బిసి , డివిజన్62: బిసి మహిళ, డివిజన్63: బిసి , డివిజన్64: బిసి మహిళ, డివి జన్65: జనరల్, డివిజన్66: జనరల్ కు కెటాయించారు.

# రిజర్వేషన్ల ఖరారుతో హుషారు




**ప్రజాపక్షం/ధర్మపురి :** రాష్ట్రంలోని మున్సిపాలిటీ ఎన్ని కల రిజర్వేషన్లను ప్రభుత్వం శనివారం ఖరారు చేసింది.దీంతో జగిత్యాల జిల్లా ధర్మపురి పురపాలక కేంద్రంలో ఒక్కసారిగా ఎన్నికల వేడి రాజుకుంది.ధర్మ పురి మున్సిపల్ పరిధిలో 15 వార్డులు వుండగా వార్డుల వారీగా ప్రభుత్వం రిజర్వేషన్ ప్రకటించింది.అదేవిధంగా ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ స్థానాన్ని జనరల్ మహిళా కేటగిరీగా రిజర్వ్ చేసింది.ధర్మపురి 1వ వార్డు ఓసీ జనరల్,2 ఓసీ మహిళ,3 జనరల్,4బీసీ జనరల్, 5 బీసీ మహిళా 6 జనరల్,7 ఎస్టీ జనరల్,8 ఎస్సీ మహిళ,9 ఓసీ మహిళ,10 బీసీ జనరల్, 11 ఓసీ మహిళ,12ఓసీ మహిళ,13 ఓసీ జనరల్,14 బీసీ మహిళా,15 ఓసీ జనరల్ గా ప్రభుత్వం నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇలా ఉండగా మున్సిపల్ చైర్ పర్సన్ స్థానాన్ని జనరల్ మహిళ కూ రిజర్వ్ చేయడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్,బీజేపీ పార్టీల నుండి పలువురు మహిళలు బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు తమకు రిజర్వే షన్ ఏ వార్డు నుండి కలిసొస్తుందో లెక్కలు వేసుకుంటు న్నారు.కాంగ్రెస్ పార్టీ నుండి తాజా మాజీ కౌన్సిలర్లు సంగ నబట్ల సంతోషి, వేముల నాగలక్ష్మి ,జక్కు పద్మ, బీఆర్ఎస్ నుండి తాజా మాజీ చైర్ పర్సన్ సంగి సత్తెమ్మ,సంగి రేఖ,బీజేపీ నుంచి పిల్లి జ్యోతి,గాజు లక్ష్మి లు చైర్ పర్సన్ స్థానానికి పోటీపడేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.త్వర లోనే వెలువడనున్న మున్సిపల్ నోటిఫికేషన్ తో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కనుంది.

# జాతరకు నిధులు పట్ల సర్పంచ్ హర్షం



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామంలోని శ్రీ శ్రీ సమ్మక్క సారలమ్మ వేల్పమ్మ జాతరకు ప్రత్యేక నిధులు నాలుగు లక్షలు మంజూరు చేసిన ఐటి శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుకి,టిపి సిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబుకి సర్పంచ్ బియ్యని శివకుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.ఈ నిధుల మంజూరుకు సహకరిం చిన జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చొప్పరి సదానం దంకి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ కి,మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల అందరికీ సర్పంచ్ బియ్యని శివ కుమార్ కృతజ్ఞ తలు తెలిపారు.అలాగే ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామం పంచాయతీ పరిధిలోని సందరెల్లి శ్రీ శ్రీ సమ్మక్కసారక్క, వెల్పమ్మ జాతరకు ప్రత్యేక నిధులు నాలుగు లక్షలు మంజూరు చేసిన ఐటి శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుకి ,టిపిసిసి ప్రధాన కార్యదర్శి శీను బాబు తో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు,మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తో పాటు మండల నాయకులకు ముత్తారం మండలం ఓబి సి అధ్య క్షుడు అల్లం కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

# సత్వర విద్యుత్ సమస్యల పరిష్కారం

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజాబాట కార్యక్రమాన్ని శనివారం అంబారిపేట్ గ్రామంలో విద్యుత్ శాఖ సహాయక ఇంజనీర్ శ్రీధర్, గ్రామ సర్పంచ్ గొడిసెల గంగాధర్, గ్రా మ ఉప సర్పంచ్ గంగాధర్ ఆధ్వర్యంలో ప్రజాబాట కార్య క్రమం నిర్వహించారు. విద్యుత్ సహాయక ఇంజనీర్ శ్రీధర్ అధికారి మాట్లాడుతూ జగిత్యాల మండలంలో ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా గ్రామ విద్యుత్ వినియోగదా రులు విద్యుత్ పరికరాలు ఉపయోగించేటపుడు సురక్షిత నియమాలు పాటించాలని ఎఈ శ్రీధర్ తెలిపారు. రైతులు మోటార్ల దగ్గర కెపాసిటర్లు ఉపయోగించాలని వారు ప్రజ లను రైతులను కోరారు. గ్రామాలలో ఎక్కడైనా లూస్ లైన్లు సమస్యలు, విద్యుత్ ఓల్టేజ్ సమస్యలు, విద్యుత్ సరఫరాలో కానీ ఇంకా ఏదైనా విద్యుత్ సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే విద్యుత్ సిబ్బందికి వెంటనే తెలియజేయా లని విద్యుత్ పారదర్శకంగా సరఫరా చేయడానికి విద్యుత్ అధికారులు కృషి చేస్తున్నారని , ఏదైనా విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912 ను సంప్రదించి తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చి విద్యుత్ అధికారులకు సహకరించాలని గ్రామాల ప్రజలు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంబారిపేట్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్, సీనియర్ లైన్ ఇనస్పెక్టర్ రాజమల్లయ్య, స్థానిక అసిస్టెంట్ లైన్మెన్ సంతోష్, పలు వురు రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాల సదన్ బాలికలను దత్తత ఇచ్చిన కలెక్టర్

**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్ బాల సదనం నుండి ఇద్దరి పిల్ల లను (9 సం॥లు 12 స॥లు) హైదరాబాద్ కు చెందిన దంపతు లకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా శనివారం దత్తత ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. అనాథ శిశువుల దత్తత, రక్త సంబంధీకుల నుండి దత్తత తీసుకోవాలనుకునే వారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ దుర్గాన పర్వీన్, సిడ బ్ల్యుసి చైర్ పర్సన్ దనలక్ష్మి, శిశు గృహ మేనేజర్ (ఇంచార్జ్) తేజస్వి, రాజ్ కుమార్, బాలసదనంసూపరింటెండెంట్ సంతోషిపాల్గొన్నారు.

## భారత నావికదళానికి ఎంపికైన నవీన్

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చెందోలి గ్రామానికి చెందిన అంకతి తిరుపతిసమత దంపతుల కుమారుడు అంకతి నవీన్ కష్టపడి చదివి భారత నావిక దళం లో ఉద్యోగం సాధించాడు. భారత నవీక దళ సీనియర్ సెకండ్రి రిక్రూట్ (ఎస్ ఎస్ ఆర్) ఇటీవల విడుదల చేసిన ఫలితాలలో ఉద్యో గానికి ఎంపిక కావడం జరిగింది. ఒకవైపు కరీంనగర్ లోని ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యను అభ్యసిస్తూనే దేశానికి సేవ చేయాలన్న సంకల్పంతో ఎన్ సి సి లో చేరి భారత నావికాదళానికి సంబంధించిన పరీక్షలకు సాధన చేసి గత సంవత్సరం పరీక్ష రాసి శారీరక సామర్థ్య పరీక్షలు పూర్తి చేయడం జరిగింది.దేశ సేవకు ఎంపిక కావడం గర్వంగా ఉందని నవీన్ తల్లి తండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.నవీన్ విజయం పట్ల స్నేహితులు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ మా అమ్మ నాన్నల ఆశీర్వాదంతో దేశ సేవలో భాగస్వామిని అవ్వడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

## మంత్రి చేతుల మీదుగా బహుమతి అందుకున్న రాహుల్



**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లాలో శనివారం జరిగిన ఆటల పోటీల్లో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో చదువుతున్న బి రాహుల్ జిల్లా స్థాయిలో షార్టపుట్ జూనియర్ విభాగంలో ద్వితీయ బహుమతి ని సాధించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జగిత్యాల ఎం.ఎల్.ఎ సంజయ్ కుమార్ ల చేతుల మీదుగా బహుమతిని బి. రాహుల్ అందుకున్నాడు. ఈ మేరకు మండల విద్యాధికారి బండారి మధు, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు రాజన్న, ఈ ఆర్ పి శ్రీకాంత్, స్పెషల్ ఎడ్యుకేటర్ స్వాతి, ఉపాధ్యాయుని, ఉపాధ్యా యులు విద్యార్థి రాహుల్ ను అభినందించారు.

## సిఎం కప్ టార్చ్ ర్యాలీకి స్వాగతం



**ప్రజాపక్షం/పాలకుర్తి:**పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌న గర్‌కు చేరకున్న సిఎం కప్ టార్చ్ ర్యాలీకి గ్రామ సర్పంచి పర్శవేని శ్రీనివాస్ఆధ్వర్యంలోశనివారంస్వాగతంపలికారు.స్థానికజెడ్పి ఉ న్నత పాఠశాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి ర్యాలీ చేపట్టారు. ఈ కా ర్యక్రమంలో జిల్లా క్రీడాధికారి సురేష్, ఎంపిడిఓ శశికళ, ఎంపి ఓ సుదర్శన్,ప్రధానోపాధ్యాయురాలుగాయత్రిదేవి,వ్యాయామఉపా ధ్యాయుడుసోమశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నా రు.

# ఉచిత ఇసుక పథకాన్ని కొనసాగించాలి

ప్రజాపక్షం/అంతర్గాం : ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ఉచితంగా రవాణా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకాన్ని అంతర్గాం మండలంలో కొనసాగించాలని మూర్మూర్, ఎల్లంపల్లి, టిటిఎస్ అంతర్గాం గ్రామాల ట్రాక్టర్ యజమానులు కోరారు. శనివారం అంతర్గాం మండల కేంద్రం వద్ద సమావేశమై మాట్లాడారు. గత రెండు మాసాలుగా ఉచిత ఇసుక పథకాన్ని నిలిపివేయడంతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదేవిధంగా ట్రాక్టర్ల నడవక యాజమానులకు, డ్రైవర్లు, కూలీలకు ఏలాంటి ఉపాధి లేకుండా పోయిందన్నారు. గోదావరిఖని క్యాంపు కార్యాలయంలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్‌ను కలిసి వారు విజ్ఞప్తి చేశారు. ఉచిత ఇసుక పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేసినట్లు ట్రాక్టర్ల యజమానులు తెలిపారు.

# సిఎం కప్ జ్యోతి ప్రజ్వలన, ర్యాలీ



ప్రజాపక్షం/అంతర్గాం: పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో సీఎం కప్‌కు స్వాగతం పలికి జ్యోతి ప్రజ్వలన చేసి ర్యాలీని శనివారం నిర్వహించారు. టార్చ్ ర్యాలీ 2వ ఎడిషన్ కార్యక్రమంలో భాగంగా టిటిఎస్ అంతర్గాం నుంచి ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. సీఎం కప్ పోటీల్లో 44 క్రీడాంశాల్లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తహసీల్దారు తూము రవీందర్ పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి సురేష్, ఎంపిడివో జి.తిరుపతి, ఎంపీవో బైరి వేణుమాధవ్, గిర్దావర్లు ఎస్.శ్రీమాన్, జి.రమేష్, అంతర్గాం సర్పంచి అంబోతు రవికుమార్ నాయక్, వ్యాయామ ఉపాధ్యాయురాలు శోభ, జి.సాయికుమార్, ప్రణీత్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి యువకుడు మృతి

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్‌: తన మేకలను కాపాడడానికి వెళ్లి కెనాల్ లో పడి పెద్దపల్లి మండలం చందపల్లి(డబుల్ బెడ్ రూమ్ ) కి చెందిన యువకుడు సయ్యద్ సహద్( 19) మృతి చెందినట్లు పెద్ద పల్లి ఎస్సై లక్ష్మణ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి లోని గవర్నమెంట్ ఐటిఐ కాలేజ్ లో సెకండియర్ చదువుతున్నాడనీ, శుక్రవారం రోజున వారి మేకలు మే పడానికి వెళ్లగా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చందపల్లి శివారులోని డి83 కెనాల్ (పవర్ హౌస్ దగ్గరలో) వద్ద మేకలు పడిపోవడంతో వాటిని తీసే క్రమంలో మృతుడు ప్రమాదవశాత్తు అందులో పడి ఈత రాక కొట్టుకొని పోయాడని, అతని గురించి వెతుకుతుండగా శనివారం ఉదయం పవర్ హౌస్ దగ్గరలో చనిపోయి ఉన్నాడని, అతని తండ్రి ఖాదర్ పిర్యాదు పై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సింగరేణి కార్మికులకు అండగా ప్రజా ప్రభుత్వం

రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్



ప్రజాపక్షం/గోదావరిఖని : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, వారికి అండగా ఎల్లప్పుడూ ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ అన్నారు. శనివారం ఉదయం గోదావరిఖనిలోని సింగరేణి 2, 2ఎ ఇంక్లయిన్ గనుల వద్ద కార్మికులను కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. తాను ఇప్పటివరకు 27 సార్లు అసెంబ్లీలో స్థానిక సమస్యలను ప్రస్తావించానని అందులో ఎక్కువగా సింగరేణి కార్మికుల సమస్యలే ఉన్నాయన్నారు. డిపెండెంట్ ఉద్యోగాలను తప్పకుండా కొనసాగించేలా చూస్తానన్నారు. విజిలెన్స్, మారుపేర్ల సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. సంఘాలకు అతీతంగా ప్రతిఒక్క కార్మికుడికి పని చేస్తానన్నారు. సింగరేణి సంస్థను కాపాడుకునే బాధ్యత మనందరిపైన ఉన్నదని కార్మికులకు తెలిపారు. అనంతరం ఆర్‌జి1 జీఎం డి.లలిత్ కుమార్, అధికారులు, కార్మికులతో కలిసి క్యాంటిన్‌లో అల్పాహారం చేశారు. ముందుగా బైక్ ర్యాలీగా గనుల వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకు జీఎం లలిత్‌కుమార్, అధికారుల బృందం స్వాగతం పలికారు. కార్మికులు బాణాసంచా పేల్చి డప్పు చప్పుళ్లతో పెద్ద ఎత్తున ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారి గుడిలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఒసిపి ప్రాజెక్టు ఆఫీసర్ డి.రమేష్, అధికారులు షేక్ అల్లావుద్దీన్, జాన్సన్, డి.రమేష్‌బాబు, దొంత వెంకటేశ్వర్లు, కోల మల్లేష్, జి.కుమారస్వామి, వీరారెడ్డి, నాయకులు పొలసాని శ్రీనివాస్, జనగామ శ్రీనివాస్, అరగంటి కృష్ణ, రసమళ్ల కిరణ్, నాయకులు కత్రోజ్ మోహన్‌బాబు, సాయికుమార్, పాల్గొన్నారు.

# సోలార్ ప్లాంటు చేయడం తీవ్ర అన్యాయం

బిజెపి నేత మొలుమూరి శ్రీనివాస్



ప్రజాపక్షం/రామగిరి:గత ప్రభుత్వంలో రాష్ట్ర హోం మంత్రి రామగిరి పోలీస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భూమిలోనే సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడం పూర్తిగా అన్యాయమని బీజేపీ మాజీ ఎంపీటీసీల ఫోరం, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. రామగిరి మండలాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్న మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఎంపీ గడ్డం వంశీకృష్ణల తీరును ఆయన తప్పుబట్టారు.రామగిరి మండలంలో 16 గ్రామపంచాయతీలు, సుమారు 50 వేల జనాభా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఒక్క ప్రభుత్వ నూతన భవనం కూడా నిర్మించలేదని పేర్కొన్నారు. మండల కార్యాలయాలు శిథిలావస్థలో ఉండటంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ప్రజలకు సరైన సేవలు అందడం లేదన్నారు. మహిళలు, వృద్ధులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.మండలంలోని గ్రామాలన్నీ సింగరేణి ప్రభావిత గ్రామాలే అయినప్పటికీ, నూతన ప్రభుత్వ భవనాలకు స్థలాలు కేటాయించకుండా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడం కార్మిక వాడల క్వార్టర్స్‌లో నివసిస్తున్న కార్మికులకు ఇబ్బందులు కలిగిస్తోందని అన్నారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులు, డీఎంఎఫ్టీ నిధులు ఇతర జిల్లాలకు తరలిపోతుండగా, రామగిరి మండలానికి రావాల్సిన నిధులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలు ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఎంపీ గడ్డం వంశీకృష్ణలు పట్టించుకోవడం లేదని, ప్రజా సమస్యలపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు.రామగిరి మండలానికి వెంటనే ప్రభుత్వ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణం చేపట్టాలని, సింగరేణి సీఎస్ఆర్ నిధులు, డీఎంఎఫ్టీ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సోలార్ ప్లాంట్‌ను నిలిపివేసి, ఆ స్థలాన్ని నూతన ప్రభుత్వ భవనాలకు కేటాయించేలా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఎంపీ గడ్డం వంశీకృష్ణలు అధికారులను ఆదేశించాలని కోరారు.

# ఓట్ల కోసం కులసంఘాలను మోసం చేస్తున్న మంథని ఎమ్మెల్యే

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



ప్రజాపక్షం/ముత్తారం : ఎన్నికలు వస్తేనే అభివృద్ధి పనులు గుర్తుకు వచ్చే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈసారి ఓట్ల కోసం కుల సంఘాలను మోసం చేస్తున్నాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. శనివారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత అక్టోబర్ మాసంలో కుల సంఘాలకు భవనాలు మంజూరు చేశానంటూ పాలాభిషేకాలు చేయించుకున్న మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆ భవనాలకు జనవరి 12న శంఖుస్థాపనలు చేశారని అన్నారు. అయితే మంథని పట్టణంలోని పోచమ్మ గుడి వద్ద మేర, పూసల, స్వర్ణకార, కుమ్మరి, నాయిబ్రాహ్మణ కుల సంఘాలకు ఒకే చోట భవన నిర్మాణాల కోసం శిలాఫలకాలు వేసి శంఖుస్థాపన చేశారని, అయితే ఆ ప్రాంతమంతా వాగు ఒడ్డున ఉందని, ముంపుకు గురయ్యే ప్రాంతంలో కులసంఘ భవనాలు నిర్మించడం ఏంటని ప్రశ్నించారు. ప్రశ్నించారు. బఫర్ జోన్, నాలా నద్దీ ప్రాంతాల్లో నిర్మించిన నిర్మాణాలను తొలగిస్తున్న క్రమంలో ఇక్కడ భవనాలు నిర్మిస్తామనడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అరైవ్ -అలైవ్



ప్రజాపక్షం/ముత్తారం : రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసు శాఖ అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ముత్తారం ఎస్సై రవికుమార్ తెలిపారు. శనివారం ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ముత్తారం ఎస్సై ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగేవాహనదారుల నిర్లక్ష్యం, అతివేగం, అజాగ్రత్తల కారణంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయన్నారు. హెల్మెట్ ధరిస్తే అది మీ ప్రాణాలను కాపాడుతుందని గ్రహించాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలన్నారు. అలాగే విద్యార్థులకు రోడ్డు భద్రత జాగ్రత్తలపై ఎస్సే రైటింగ్ పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

# గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యం

రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్

ప్రజాపక్షం/పెద్దపల్లి: రామగుండం కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల సన్నాహాక సమావేశం ఆదివారం మార్కండేయ కాలనీ శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్లో మధ్యాహ్నం 2 గంటలకు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. రామగుండం కార్పొరేషన్ గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా గులాబీ సైనికులు పనిచేయాలని పెర్కొన్నారు. 60 డివిజన్లో బీ.ఆర్.ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నమని ఆయా డివిజన్లబిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నాయకులు హాజరు కావాలని కోరారు.

# కాంగ్రెస్ నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా రాజేశం

ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ అధ్యక్షునిగా రాజేశం ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఆధ్వర్యంలో అడవి శ్రీరాంపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన శాఖ అధ్యక్షుడిగా దేశిని రాజేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతన అధ్యక్షుడు దేశిని రాజేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలని, గ్రామంలో కాంగ్రెస్‌ను మరింత బలపడేలా చేయాలని సూచించారు.కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య,ముత్తారం మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు వాజీద పాషా,గ్రామ సర్పంచ్ అన్నపూర్ణ ఉపేందర్,ఉప సర్పంచ్ అనవేన హరిత తిరుపతి,వార్డు సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు.

# శ్రీ సమ్మక్క-సారలమ్మ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామపంచాయతి పరిధిలోని సందరెల్లి శ్రీ సమ్మక్కసారలమ్మ దేవస్థాన నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఖమ్మంపల్లి శ్రీ సమ్మక్కసారలమ్మ నూతన దేవస్థాన కమిటీ అధ్యక్షుడిగా పర్వ ఓదెలు,ఉపాధ్యక్షుడుపెద్ది ప్రశాంత్,ప్రధానకార్యదర్శిమేకల రాజేందర్,కార్యదర్శి బొద్దు జితేందర్,కోశాధికారి మేకల లక్ష్మీ రాజం, అధికార ప్రతినిధి మేకల రాజేందర్,ప్రచార కమిటీ కన్వినర్ పర్వ అజయ్ ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా పర్వ రమేష్,పెద్ది రమేష్, పెద్ది రామన్న,పర్వ రాజేందర్,పెద్ది భూమయ్య,ఐద సమ్మయ్య,పర్వ మహేష్,చెద మహేష్,ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సమ్మకసారలమ్మ జాతర ఉత్సవాలు ఉత్సహంగా పనిచెయ్యాలని, రాబోయే జాతరలో సైనికుడిలా పనిచేసి దేవస్థానం కోసం కృషి చెయ్యాలని అన్నారు.అనంతరం సమ్మక్క సారలమ్మ నూతన కమిటీకి గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అప్పగించిన ఎస్ఐ



ప్రజాపక్షం/ముత్తారం : నూతన సాంకేతిక పరిజ్ఞానం(సిఇఐఆర్)తో పోగొట్టుకున్న ఫోన్లను వెతికి పట్టుకోవడంలో పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనరేట్ పరిధి లోని ముత్తారం మండల పోలీసులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామానికి చెందిన ఎర్రం రాము ముత్తారం గ్రామానికి చెందిన నేరెళ్ల కుమార్ వేర్వేరు చోట్ల తమ ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈమేరకు స్థానిక పోలీసులను ఆశ్రయించి వారు తమ ఫోన్ పోయాయని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.వేర్వేరుగా కేసులు నమోదు చేసిన పోలీసులు సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) అప్లికేషన్ ఉపయోగించి పోయిన ఇద్దరి సెల్ఫోన్లను వెతికి పట్టుకున్నారు. ఈక్రమంలో ఎస్సై ఎన్. రవికుమార్,ఎఎస్ఐ సత్తయ్య బాధితులను శనివారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఫోన్ స్వయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా మున్సిపల్ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మున్సిపల్ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ వార్డుల వారీగా రిజర్వేషన్ కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులు, కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలో 30 వార్డులకు డెడికేషన్ కమిషన్ కేటాయింపు ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు వివరించారు. మహిళలకు కేటాయించిన వార్డులను లాటరీ పద్ధతిలో కేటాయించామని తెలిపారు. షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, జనరల్ విభాగాల్లో 50 శాతం సీట్లను మహిళలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాజకీయ పార్టీల సమక్షంలో నిబంధనల ప్రకారం జరిగిందని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్లు గజానన్, రాజేందర్, పట్టణ ప్రణాళిక అధికారి యశ్వంత్, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆదివారం 6 గంటలపాటు విద్యుత్ అంతరాయం

**ప్రజాపక్షం / కాసిపేట :** మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల్లో ఆదివారం 6 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. 67.5 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌కు అవసరమైన 220 కెవి లైన్ స్ట్రింగింగ్ పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, శ్రీరాంపూర్‌లోని అన్ని కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ సమయంలో సంబంధిత ప్రాంతాల్లోని గనులు, కొన్ని విభాగాలకు మాత్రమే ఆర్‌జి 3 నుండి పరిమిత విద్యుత్ సరఫరా అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. అత్యవసర పనుల దృష్ట్యా చేపడుతున్న ఈ విద్యుత్ అంతరాయానికి ప్రజలు, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ సిబ్బంది కోరారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

**ప్రజాపక్షం / లక్షెట్టిపేట :** లక్షెట్టిపేట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి పొలకుర్తి సత్యనారాయణ (63), ఆయన భార్య రమ (59) కన్యాకుమారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పట్టణంలో సత్యనారాయణ జనరల్ స్టోర్ నిర్వహిస్తున్న ఈ దంపతులు మరణించడంతో లక్షెట్టిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ నెల 8వ తేదీన వీరిద్దరూ అయ్యప్ప మాల ధరించి ఒక ప్రైవేట్ టూరిస్ట్ వాహనంలో శబరిమల యాత్రకు వెళ్లారు. ఈ నెల 15న మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామిని దర్శించుకున్న అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కన్యాకుమారి బైపాస్ రోడ్డు వద్ద స్వాముల దర్శనం కోసం వాహనాన్ని నిలిపివేశారు. సముద్ర స్నానాలు ఆచరించి సమీపంలోని ఆలయాలను సందర్శించిన తర్వాత తిరిగి వాహనం వద్దకు చేరుకునేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఒక వాహనం వీరిని ఢీకొట్టింది. దంపతులిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలను కన్యాకుమారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## మంత్రాల అనుమానంతో వ్యక్తిపై హత్యాయత్నం

ఐదుగురు అరెస్ట్ : ఎస్ఐ అనూష



**ప్రజాపక్షం / జన్నారం :** మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిని విద్యుత్ షాక్ ఇచ్చి చంపేందుకు ప్రయత్నించిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జన్నారం ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపిన వివరాల ప్రకారం లింగయ్యపల్లి గ్రామానికి చెందిన ఉడుతల చిన్న గంగయ్య కొత్త పుట్టిగూడ గ్రామంలో తన గొర్రెలను మేపుకుంటూ అక్కడే నివసిస్తున్నాడు. ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి సమయంలో నిందితులు అతనిపై హత్యాయత్నం చేశారు. కొత్త పుట్టిగూడకు చెందిన ఆత్రం తిరుపతి, ఆత్రం అర్జున్, లింగయ్యపల్లికి చెందిన మెరుగు మహేష్, ఉడుతల మల్లేష్, దండేపల్లి మండలం మొకాసిగూడకు చెందిన కోవా అధిరావ్ కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. తమ కుటుంబాల్లో జరుగుతున్న మరణాలు, అనారోగ్యం, గొర్రెల మృతికి చిన్న గంగయ్య చేస్తున్న మంత్రాలే కారణమని నిందితులు బలంగా నమ్మారు. అతడిని చంపితేనే తమ సమస్యలు తొలగిపోతాయని భావించి పథకం ప్రకారం విద్యుత్ వైర్లు అమర్చి హత్య చేయడానికి ప్రయత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకుని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం వారికి 14 రోజుల రిమాండ్ విధించింది.

## బొగ్గు టిప్పర్ల అతివేగం వాహనదారులకు శాపం



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** నస్పూర్ మండలం శ్రీరాంపూర్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న టిప్పర్ లారీలు తోటి ప్రయాణికుల పాలిట శాపంగా మారాయి. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ సమీపంలో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతుండడం, రోడ్డుకు ఇరుపక్కల ఉన్న హోటళ్ల కారణంగా వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ఇలాంటి రద్దీ సమయంలో ఇందారం ఐకె ఓపెన్ కాస్ట్ నుండి సిహెచ్‌పికి బొగ్గును తరలిస్తున్న టిప్పర్ల పైన టార్పాలిన్ కవర్లు కప్పకపోవడంతో బొగ్గు పెళ్ళలు, ధూళి రేణువులు వెనుక వచ్చే వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. లోడుతో వెళ్లే లారీల పైన తప్పనిసరిగా సేఫ్టీ కవర్ కప్పాలనే నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు యజమానులు, డ్రైవర్లు వీటిని బేఖాతరు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలు పాటించని లారీల వల్ల సామాన్య ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సేఫ్టీ కవర్ లేకుండా తిరుగుతున్న బొగ్గు లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలను పక్కాగా అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## భీమయ్యక్ జాతరలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం / తిర్యాణి :** మండలంలోని సుంగాపూర్ గ్రామంలో వెలసిన భీమయ్యక్ జాతరలో ఆసిఫాబాద్ ఎంఎల్ఏ కోవ లక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సుంగాపూర్ లోని భీమయ్యక్ ఆలయంతో పాటు గడల్ పల్లి గ్రామంలో నిర్వహించిన జంగో లింగో ముట్టి పూజా కార్యక్రమంలో ఆమె పాల్గొని దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కబడ్డీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని ఉత్సాహపరిచారు. జాతరలో భాగంగా గిరిజన మహిళలతో కలిసి ఎంఎల్ఏ ఉత్సాహంగా నృత్యం చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతర ఏర్పాట్లు ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు దోహదపడతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు హనుమండ్ల జగదీష్, మాజీ డిసిసిబి డైరెక్టర్ చుంచు శ్రీనివాస్, మాజీ జడ్పిటిసిలు చంద్రశేఖర్, వెడ్మ కమల, మాజీ ఎంపిపి మర్సకోల శ్రీదేవి, నాయకులు గుణవంత్ రావు, మల్లేష్, భక్తులు పాల్గొన్నారు.

## గంగమ్మ గుడి బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్

**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ పట్టణంలో గంగపుత్రులు, గంగమ్మ తల్లి భక్తులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న గంగమ్మ తల్లి దేవాలయానికి 80 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే పని చేస్తున్నామని, మీరందరూ ప్రభుత్వానికి సహకరించి అండగా ఉండాలని, మోసపూరిత మాటలను నమ్మవద్దని మున్సిపల్ ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగర వేయాలని కోరారు.

## కాంగ్రెస్‌లోకి రాజన్న యూత్ అధ్యక్షుడు

150 మంది అనుచరులతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడలో మున్సిపల్ ఎన్నికల ముందే రాజకీయం వేడెక్కింది.బిజెపి పార్టీ యువ నాయకుడు, రాజన్న యూత్ అధ్యక్షుడు బోనాల శివ ఆధ్వర్యంలో సుమారు 150 మంది కార్యకర్తలు బిజెపికి గుడ్ బై చెప్పారు. వీరంతా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే తాము కాంగ్రెస్‌లో చేరినట్లు బోనాల శివ ఈ సందర్భంగా తెలిపారు. ఎన్నికల వేళ ఈ వలసలు బిజెపికి భారీ దెబ్బగా మారనున్నాయి.

## అభివృద్ధి పనులకు స్థలాలు పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు స్థలాలు ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం పరిశీలించారు. చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి, చందుర్తిలో వేర్ హౌస్ గోదాం కోసం, మర్రిపల్లి గ్రామంలో రైతు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి, వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి వద్ద బిసిభవన్ నిర్మాణానికి రెవెన్యూ అధికారులతో కలిసి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్థలాలు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో స్థలాలకు సంబంధించిన నక్షాలు పరిశీలించి అధికారులతో చర్చించారు. పరిశీలనలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్లు భూపతి, అబుబాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వ్యయనిర్వహణ ఖాతాలు సమర్పించండి: ఎంపిడిఓ

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :**పంచాయితీ ఎన్నికల వ్యయనిర్వహణ ఖాతాలు మండలపరిషత్ కార్యలయంలో తప్పనిసరిగా సమర్పించాలనిఎల్లారెడ్డిపేట మండలపరిషత్ అధికారి గుండోజు సత్తయ్య అన్నారు. జిల్లాకలెక్టర్ గరిమాఅగర్వాల్ ఆదేశానుసారం మొదటి,రెండో,తుది విడతల వారిగా జిల్లాలో నిర్వహించిన తేదిలకు గడువులోగా ఎన్నికలలో పోటీచేసిన అభ్యర్థులు 45 రోజుల లోగా సమర్పించాలని ఆదేశాలు ఉన్నాయి.ఎల్లారెడ్డిపేటలో మూడో విడత ఉంది కావున జనవరి 30తేదీలోగా తప్పనిసరిగా వ్యయనిర్వహణ ఖాతాలను సమర్పించాలని కోరారు.

# నిర్మల్ యువకుడు ప్రాణాలు కాపాడిన యశోదా వైద్యులు




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** సకాలంలో సరైన వైద్యం అందితే ప్రాణాంతకమైన రక్త క్యాన్సర్ ను కూడా జయించవచ్చని మలక్‌పేట్ యశోదా హాస్పిటల్ వైద్య బృందం నిరూపించింది.నిర్మల్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైదుౄలు,బాధితుడు తమ అనుభవాలను పంచుకున్నారు.నిర్మల్ పట్టణానికి చెందిన ఎం.డి.అహ్మద్ బైగ్(34) అనే యువకుడు ఆక్యూట్ మైలోయిడ్ లుకీమియా(ఎఎంఎల్)అనే అత్యంత వేగంగా వ్యాపించే రక్త క్యాన్సర్ బారిన పడ్డారు.తీవ్రమైన జ్వరం,రక్తస్రావం,ఇన్ఫెక్షన్లతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని మలక్‌పేట్ లోని యశోదా హాస్పిటల్‌లో చేర్పించారు.ఈ సమావేశంలో కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డా.రోహిత్ రెడ్డి మాట్లాడుతూ..''రోగి ఆసుపత్రికి వచ్చేసరికి పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది.తెల్ల రక్తకణాలు పడిపోయి ఇన్ఫెక్షన్లు తీవ్రమయ్యాయి.మేము వెంటనే ఇండక్షన్ కీమోథెరపీ,ఆధునిక సపోర్టివ్ కేర్ ప్రారంభించాము,క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పటికీ,వరుసగా కన్సాలిడేషన్ సైకిల్స్ పూర్తి చేసి రోగిని క్యాన్సర్ నుండి విముక్తుడిని చేయగలిగాము''అని వివరించారు.ప్రాణాపాయ స్థితి నుండి కోలుకున్న అహ్మద్ బైగ్ మాట్లాడుతూ, తనకు పునర్జన్మ ప్రసాదించిన డాక్టర్ రోహిత్ రెడ్డికి యశోదా హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.యశోదా హాస్పిటల్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి ప్రతినిధులు మాట్లాడుతూ..అత్యాధునిక సాంకేతికత,24/7 క్రిటికల్ కేర్ః సదుపాయాల వల్లే ఇలాంటి క్లిష్టమైన కేసులను విజయవంతం చేయగలుగుతున్నామని పేర్కొన్నారు.సరైన సమయంలో గుర్తిస్తే నయం చేయవచ్చని వారు ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు.ప్రెస్ క్లబ్ ప్రతినిధులు,బాధితుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## యువకుడి సూసైడ్..



**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్ గ్రామానికి చెందిన కోడారి శంకర్ కుమారుడు కోడారి సాయి కుమార్(24) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.గ్రామస్థులు తెలిపిన మేరకు కోడారి సాయికుమార్ మద్యానికి బానిసై చిన్న చిన్న గొడవలు పడుతుండేవాడన్నారు.ఎప్పటిలాగే మద్యం సేవించి శుక్రవారం మద్యం మత్తులో క్రిమిసంహారక మం దు సేవించాడు.దీంతో కుటుంబీకుల యువకుడిని ఆసుపత్రికి తరలించగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు,దీంతో గ్రామంలో విషాదం నెలకొనగా అవివాహితుడైనా కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

## రోడ్డు భద్రతపై పాఠశాలదలో అరైవ్,అలైవ్ కార్యక్రమం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం ఎస్పై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అరైవ్,అలైవ్ కార్యక్రమం నిర్వహించారు.ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు,మైనర్ డ్రైవింగ్,రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.హెల్మెట్ లు ధరించక ప్రమాదాలతో కుటుంబాలు రోడ్డున పడుతున్నా యన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే అరైవ్,అలైవ్ ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఉపాధ్యాయులు,విద్యార్థులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్థల పరిశీలన చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలో శనివారం జిల్లా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి స్థల పరిశీలన చేశారు. ఈ గ్రంథాలయానికి ప్రభుత్వం 45 లక్షలు మంజూరు చేసింది. త్వరలో పనులు ప్రారంభిస్తారు. గ్రామ సర్పంచ్ ఎర్రం సిలిందర్ లింగం, ఉపసర్పంచ్ రాంచందర్, వార్డు సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నిర్మల్ ఎంసిహెచ్‌కు శాంత ఫౌండేషన్ భారీ విరాళం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సిర్గాపూర్‌కు చెందిన శాంత ఫౌండేషన్ తన ఉదారతను చాటుకుంది.నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆసుపత్రి (ఎంపీహెచ్)లో చికిత్స పొందుతున్న గర్భిణులు,శిశువుల ఆరోగ్య సంరక్షణ కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కీలకమైన వైద్య పరికరాలను విరాళంగా అందజేశారు.ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు అధికారి మాధవి లత,విజయ్ కుమార్‌లు శనివారం ఆసుపత్రిని సందర్శించి,రెండు ఫీటర్ మానిటర్‌ను ఆసుపత్రి వర్గాలకు అప్పగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడే పేద, మధ్యతరగతి రోగులకు మెరుగైన చికిత్స అందాలన్న ఉద్దేశంతోనే ఈ చిన్న సాయం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మాతాశిశు మరణాల నియంత్రణకు,గర్భస్థ శిశువుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ఈ పరికరాలు ఎంతగానో దోహదపడతాయని వారు ఆకాంక్షించారు.సమాజ సేవలో భాగంగా తమ ఫౌండేషన్ తరపున ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## మున్సిపల్ వార్డుల మహిళా రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి,జిల్లాలోని నిర్మల్,బైంసా,ఖానాపూర్ మున్సిపాలిటీల వార్డుల మహిళా రిజర్వేషన్లను శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరారు చేశారు.వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్వయంగా పాల్గొని,మున్సిపాలిటీలలో వార్డుల వారిగా కేటాయించిన రిజర్వేషన్ వివరాలను తెలుపుతూ,లాటరీ పద్ధతి ద్వారా ఎస్టీ,ఎస్సీ,బీసీ,జనరల్ వారీగా మహిళలకు కేటాయించే వార్డులను ఎంపిక చేశారు.ముందుగా కలెక్టర్ మాట్లాడుతూ,నిబంధనల ప్రకారం సిపెక్ సర్వే జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేస్తున్నట్లు వివరించారు.ప్రక్రియను మొత్తం పకడ్బందీ వీడియోగ్రాఫ్ పర్యవేక్షణలో నిర్వహించామని వివరించారు.ఈ మహిళా రిజర్వేషన్ల ఖరారు కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్,బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్‌గౌడ్ ,సుందర్‌సింగ్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,ఇతర అధికారులు,సిబ్బంది,పాల్గొన్నారు.

## మల్లారంలో అన్నదాన సత్రం, జాతర

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలో మల్లారం గ్రామంలో గత వారం రోజులుగా దత్తాత్రేయుని బ్రహ్మోత్సవాలు జరిగాయి. శనివారం బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా అన్నదాన సత్రం, జాతర పెద్ద ఎత్తున జరిగింది. గత వారం రోజులుగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులు తమకు తోచినవిధంగా మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహక కమిటి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకుంది. పౌరోహితులు పూర్ణాహుతి జరిపారు.



## సిఎం కప్ టార్చి ర్యాలీ ప్రారంభం



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సిఎం కప్ ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సిఎం కప్ టోర్నీని విజయవంతంగా బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఈ ర్యాలీ ఎంపీడీఓ కార్యాలయం నుండి బయల్దేరి బడాభీమ్‌గల్ చౌరస్తాలో కార్యక్రమాన్ని ముగించారు. ఎంఈఓ స్వామి, హేమలత, చిన్నయ్య, అమూల్య భూపతి, సుజాత, కార్యదర్శులు, విద్యార్థులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

## నిజాంసాగర్‌లో సీఎం కప్ క్రీడలను ప్రారంభించిన డీసీసీ చైర్మన్



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రెండో విడత సీఎం కప్ 2025 కార్యక్రమంలో భాగంగా కాగడ ర్యాలీ నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఈ కార్యక్రమంలో ముఖ్య అథితిగా పాల్గొని కాగడ ర్యాలీని ఉత్సాహంగా ముందుకు నడిపించారు. యువతలో క్రీడా స్ఫూర్తి, ఆరోగ్యం, చైతన్యం పెంపొందించడమే ఈ సీఎంకప్ ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చీకోటి మనోజ్‌కుమార్, బంజపల్లి సర్పంచు ఏలే సుగుణమ్మ, నిజాంసాగర్ మండల ప్రజాపరిషత్ అధికారి, మండల రెవెన్యూ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## బంజేపల్లిలో తాగునీటి కష్టాలకు చెక్



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్(బంజేపల్లి) గ్రామంలో ఎన్నో రోజులుగా గ్రామస్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు గ్రామ సర్పంచే ఏలే సుగుణమ్మ చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక చర్యలు చేపట్టారు. గున్కుల్ వాగు నుండి 10 హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్ సహాయంతో గ్రామానికి నీటిని తరలించే వ్యవస్థను ఏర్పాటు చేసి నీటి ఎద్దడి లేకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టారు. దీంతో బంజేపల్లి గ్రామస్థలకు నీటి సమస్య పూర్తిగా తొలగిపోయింది. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు కృషి, డీసీసీ చైర్మెన్ ఏలే మల్లికార్జున్ అందించిన పూర్తి సహకారంతో లోటుపాట్లు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

## మాజీ ఎంపిపి పాల్దే లక్ష్మి సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దిలావర్‌పూర్ మండల మాజీ ఎంపీపీ పాల్దే లక్ష్మి (47) మండల అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి ఎనలేని కృషి చేసి మండల ప్రజల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వి.సత్యనారాయణ గౌడ్ అన్నారు.ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడంలో,అంకిత భావంతో పని చేశారని లక్ష్మి సేవలను కొనియాడారు.చిన్న తనంలోనే ఆమె మరణం బాధాకరమని,కుటుంబానికి తీరని లోటని,ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు.కుటుంబ సభ్యులకు మనో ధైర్యం కల్పించారు.ఆయన వెంట పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ నవీన్ రెడ్డి,రాజారెడ్డి,ముత్యం,అభినవ్ ఉన్నారు.

## డాక్టర్ వేణుగోపాలకృష్ణకు సంక్రాంతి కవి సన్మానం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రముఖ వైద్యులు డాక్టర్ వేణుగోపాలకృష్ణ వైద్య వృత్తిలో ఉన్నత సేవలందించి ఉత్తమ వైద్యునిగా పలు జాతీయ,రాష్ట్ర జిల్లా స్థాయి అవార్డులు పొందిన విషయం విదితమే ప్రేమతో నాన్న చిత్రానికి ఉత్తమ కళాకారుని గా,దర్శకునిగా నంది పురస్కారాలు అవార్డులు వరించాయి కవిగా ఎన్నో కార్యక్రమాలు మంచి రచనలు చేసి సత్కారాలు పొందారు.డాక్టర్ వేణుగోపాలకృష్ణ ఎస్.టి.యు భవన్లో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొని కవితా గానం చేశారు.పలువురి ప్రశంసలు పొందారు డాక్టర్ వేణుగోపాలకృష్ణ ఈ కార్యక్రమంలో పలువురు కవులు డాక్టర్ వేణుగోపాలకృష్ణ ను సన్మానించి,అభినందించారు.

# వంజరిపల్లె గ్రామ మంచి నీటి బావి దుస్థితి ఇలా నీరు తగ్గేదెలా?

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** గ్రామ పంచాయతీ సర్పంచ్లులు లేక గ్రామ పంచాయతీలలో పనులు ఎక్కడ వేసినా గొంగ్గది అక్కడే ఉండేది కానీ నూతన సర్పంచులు పదివి బాధ్యతలు స్వీకరించిన తరువాత కూడా కొన్ని గ్రామ పంచాయతీ తీరు గ్రామ పాలనలో పట్టలెక్కలేకపోయిందని గ్రామాల ప్రజలు విమర్శలు చేస్తున్నారు. గ్రామంలో ముఖ్యమైన మంచి నీటి వ్యవస్థను పట్టించుకోకుండా మంచి నీటి బావిలో పాకూరు పేరుకుపోవడంతో బావి లో బ్లీచింగ్ వ్యవస్థను పట్టించుకునే నాథులే కరువయ్యారని తెలుస్తుంది. జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లె గ్రామానికి చెందిన మంచి నీటి బావిలో పాకూరు పేరుకుపోయి ఉండడం కలుషిత నీటిని గ్రామ ప్రజలకు తాగడానికి సరఫరా చేస్తున్నారని గ్రామంలో కొందరికి ఆ నీరు తాగడం ద్వారా వ్యాధుల బారిన పడుతున్నారని గ్రామ ప్రజలు తెలిపారు. ఇకనైనా సంబంధిత మండల, గ్రామ అధికారులు స్పందించి గ్రామ మంచి నీటి బావిలో పాకూరు శుభ్రపరచి గ్రామ ప్రజలకు సురక్షితమైన నీటిని అందించాలని వంజరిపల్లె గ్రామ ప్రజలు కోరుతున్నారు. జగిత్యాల మండల సంబంధిత అధికారులు మొక్కుబడిగా గ్రామాలలో పర్యటనలను చేయకుండా గ్రామాలలో సమస్యలను తెలుసుకొని సమస్యల పరిష్కారానికి మండల సంబంధిత అధికారులు కృషి చేయాలని జగిత్యాల మండల ప్రజలు కోరుతున్నారు.



## క్రీడలతో మానసిక ఉల్లాసం

**ప్రజాపక్షం/బోధన్:** క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడలు ఆడటం వల్ల ఆరోగ్యంగా ఉంటారని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. సీఎం కప్ ర్యాలీ కార్యక్రమంలో భాగంగా శనివారం బోధన్ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు క్రీడాకారులు కాగడతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు యువకులు ఏదో ఒక క్రీడలో ప్రావీణ్యం సాధించి జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలని సూచించారు. ఈ ర్యాలీలో పట్టణ సిఐ వెంకట్ నారాయణ, ఎంపీడీవో, ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ రిజర్వేషన్ల పక్రియ పూర్తి

**ప్రజాపక్షం/బోధన్:** మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మున్సిపల్ వార్డుల వారిగా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తైంది. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి సమక్షంలో మహిళ రిజర్వేషన్లను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేవారు. బోధన్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలో 38వార్డులు ఉండగా, అందులో 18వార్డుల రిజర్వేషన్లు మహిళలకు కేటాయించారు. ఇందులో బీసీ మహిళలకు ఏడు, కాగా జనరల్ మహిళలకు 11వార్డులు కేటాయించారు. ఎస్టీ మహిళకు ఒక వార్డు కేటాయించగా, 8వార్డులు బీసీ జనరల్‌కు కేటాయించారు. 8వార్డులు జనరల్ వార్డులుగా కేటాయించారు. బోదన్ మున్సిపల్ ఛైర్మన్ పదవికి జనరల్ రిజర్వేషన్ ఖరారు అయ్యింది. ఈ రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో మున్సిపల్ ఎన్నికల అభ్యర్థులు వార్డులలో రిజర్వేషన్లపై చర్చలు కొనసాగిస్తున్నారు.

## భీమ్‌గల్ మున్సిపాలిటీని గెలిపించుకుందాం

వేముల ప్రశాంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/భీమ్‌గల్:** భీమ్‌గల్ ఎల్‌జె ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన పట్టణ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలే మన పార్టీ బలానికి నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో 40 కి పైగా సర్పంచ్‌లను, ఏడు మండల కేంద్రా ల్లో ఐదు మండల కేంద్రాల సర్పంచ్‌లను మనమే గెలిపించుకున్నామని, గ్రామస్థాయిలో నా యకులు, కార్యకర్తలందరూ కలిసికట్టుగా పని చేయటంతోనే ఈ విజయం సాధ్యమైందన్నారు. మున్సిపాలిటీలో ఓట్లు అడిగే నైతిక హక్కు టీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉందని స్పష్టం చేశారు.

## ల్యాబ్ టెక్నీషియన్ లకు నియామక పత్రాల అందచేత

**ప్రజాపక్షం/ ఎడపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఎంపిక చేసిన ల్యాబ్ టెక్నిషియన్ గ్రేడ్ 2 అభ్యర్థులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రాజశ్రీ ఎంపికైన అభ్యర్థులకు వారి పోస్టింగ్ ఉత్తర్వులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన సేవలు అందించడంలో ల్యాబ్ టెక్నిషియన్ల పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. రోగ నిర్ధారణ పరీక్షలను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు. రోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం అంకిత భావంతో పని చేయాలని కోరారు. బోధన్ డివిజన్‌లోని ఎడపల్లి ల్యాబ్ టెక్నిషియన్‌గా ఉదయ్, రెంజల్ ల్యాబ్ టెక్నిషియన్ గా ఖన్నా రాజ శేఖర్, సాలూర ల్యాబ్ టెక్నిషియన్‌గా సృజన, నవీపేట్ ల్యాబ్ టెక్నిషియన్లను వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించినట్లు ఆమె వెల్లడించారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, తమకు కేటాయించిన కేంద్రాలలో తక్షణమే విధుల్లో చేరుతామని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుమంత్ కుమార్, సూపరింటెండెంట్ వినయ్ కుమార్, జస్టిన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## నీలా గ్రామ పంచాయతీకి 15 ఎల్ఇడి బల్బుల విరాళం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** రెంజల్ మండలంలోని ధూపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, మీ కోసం మేము సేవా సంస్థ వ్యవస్థాపకులు రఘుపతి లక్ష్మ య్య తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తన కుమార్తె లోక్షిత పుట్టిన రోజును పురస్కరించుకొని నీలా గ్రామ పంచాయతీ సర్పంచి, బిజెపి మండల అధ్యక్షులు క్యాతం యోగేష్‌పై ఉన్న అభిమానంతో గ్రామానికి 15ఎల్ఈడీ బల్బులను విరాళంగా అందచేశారు. గ్రామంలోని వీధి దీపాల వెలుగుల కోసం సుమారు రూ. 25వేలు ఈ బల్బులను లక్ష్మ య్య కొనుగోలు చేసి గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఈ సందర్భంగా సర్పంచి క్యాతం యోగేష్ మాట్లాడారు. తనపై ఉన్న అభిమానంతో, సామాజిక బాధ్యతగా నీలా గ్రామ అభివృద్ధికి సహకరించిన రఘుపతి లక్ష్మ య్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. అనంతరం లక్ష్మ య్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. సొంత గ్రామం కాకపోయినప్పటికీ, కేవలం అభిమానంతో మా ఊరి వెలుగుల కోసం బల్బులను విరాళంగా ఇవ్వడం అభినందనీయం. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తినిస్తాయని సర్పంచి క్యాతం యోగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నీలా గ్రామ ఉప సర్పంచి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బంజారా సంఘాల ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/బోధన్:** బంజారా సంఘాల ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో విడుదలైన మున్సిపాలిటీ కార్పొరేషన్ల రిజర్వేషన్ కేటాయింపులో తెలంగాణ బంజారా ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. 2019 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీల రిజర్వేషన్ ఏడు శాతం నుంచి పది శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, ఆ రిజర్వేషన్‌ను బేఖాతర్ చేస్తూ కేవలం ఏడు శాతం రిజర్వేషన్‌ని పరిగణలోకి తీసుకొని రిజర్వేషన్ ఖరారు చేయడం సమంజసం కాదని అన్నారు. భారత రాజ్యాంగం లంబాడాలకు కల్పించిన హక్కులను కాల రాయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఒకసారి బంజారా ప్రజలు కూడా ఈ విషయాన్ని ఆలోచించాలని తెలిపారు. ఈ విషయాన్ని బంజారా ప్రజా ప్రతినిధులు ఉద్యోగ సంఘాల నాయకులు, బంజారా యువ నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు, అందరూ పార్టీలకు సంఘాలకు అతీతంగా స్పందించాలని కోరారు.

## ప్రతి ఇసుక వాహనానికి ఇన్సురెన్స్ తప్పనిసరి

**ప్రజాపక్షం/బోధన్:** ఇసుక నడిపే ఆటో ట్రాక్టర టిప్పర్ వాహనాలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, లేని ఏడల చట్ట పరమైన చర్యలు తీసుకోబడతాయని బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు తెలిపారు. బోధన్ పట్టణంలోని రూరల్ సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.వాహనాలు నడిపే వారికి ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని వాహన యజమానులు వాహనానికి ఇన్సూరెన్స్ చేయించాలని సూచించారు.మచ్చేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్

**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో సందర్శించారు. రోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆస్పత్రి మొదటి అంతస్తు నుంచి ఆర్ఎంఓ క్వార్టర్స్‌కు మారుస్తున్న డయాలిసిస్ సెంటర్‌కు సంబంధించి కొనసాగుతున్న పనులను పరిశీలించారు.

## సమావేశం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండల పాస్టర్స్ అసోసియేషన్ భీమ్‌గల్ సమావేశం అధ్యక్షులు రిక్క దేవదాస్ అధ్యక్షతన జరిగింది. ప్రస్తుత పరిస్థితులు భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. మండలంలో నూతన అసోసియేషన్లు ఎన్ని ఏర్పాటైన మండల పాస్టర్ అసోసియేషన్‌కు ఎటువంటి సంబంధం లేదన్నారు. భవిష్యత్తు కార్యక్రమాలు ఐక్యతతో నిర్వహించబడుతాయన్నారు. త్వరలో తేది నిర్ణయించి మండల పాస్టర్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించబడన్నారు. కార్యక్రమంలో దేవదాస్, షద్రక్, డేవిడ్‌రాజ్, ప్రేమ్‌కుమార్, ఇశ్రాయేల్, పరంజ్యోతి, జెమ్స్, ఏలియా, సోలోమోన్ పాల్గొన్నారు.

## వార్డు వారీగా రిజర్వేషన్ల జాబితా

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** భీమ్‌గల్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వార్డుల వారిగా రిజర్వేషన్లను కలెక్టర్ శనివారం విడుదల చేశారు. వివరాల ప్రకారం 1వ వార్డు జనరల్, 2వ వార్డు ఎస్సీ(మహిళ), 3వ వార్డు జనరల్, 4వ వార్డు జనరల్ (మహిళ), 5వ వార్డు జనరల్ (మహిళ) 6వ వార్డు జనరల్(మహిళ), 7వ వార్డు బీసీ జనరల్, 8వ వార్డు ఎస్సీ జనరల్, 9వ వార్డు బీసీ జనరల్, 10వ వార్డు జనరల్(మహిళ), 11వ వార్డు ఎస్టీ(జనరల్), 12వ వార్డు బీసీ (మహిళ) వార్డుల రిజర్వేషన్లతో ఆశావాహుల సందడి పట్టణంలో నెలకొంది.

## కల్యాణలక్ష్మీ పేదలకు వరం

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** పేదింటి ఆడపడుచులకు అండగా కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ ఉందని పల్లె (హరిపూర్) సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్ అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురకంటి చిన్నారెడ్డి సూచన మేరకు శనివారంగ్రామపంచాయతీ ఆవరణలో చెక్కులను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకుని ఆర్థికంగా లబ్ధి పొందాలని పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పేదింటి యువతుల వివాహానికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో లబ్ధి చేకూరుస్తున్నాయన్నారు. కాంగ్రెస్‌గ్రామశాఖ అధ్యక్షులు రాంసన్, నాయకుల ధర్మయ్య, రంజిత్‌కుమార్, సుధాకర్, నితిన్‌రాజ్, లక్ష్మ ణ్, శ్రీరాం, అశోక్, నర్సింగ్, శ్రావణ్ పాల్గొన్నారు.

## మోర్తాడ్‌లో సిఎం కప్ 2026 టార్చ్ ర్యాలీ

**ప్రజాపక్షం/మోర్తాడ్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్‌లో భాగంగా శనివారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ హై స్కూల్ గ్రౌండ్‌లో సీఎం కప్ 2026 టార్చ్ ర్యాలీని ఘనంగా ప్రారంభించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథులుగా మోర్తాడ్ మండల తహసీల్దార్ సిహెచ్.కృష్ణ, ఎంపీఓ శ్రీధర్, మండల విద్యాధికారి సమ్మిరెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మోర్తాడ్ సబ్ ఇన్స్‌స్పెక్టర్ రాము, మోర్తాడ్ మండల సర్పంచిల ఫోరం అధ్యక్షులు అనిల్, మోర్తాడ్ గ్రామ ఉప సర్పంచి ఎం.శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ బోనగిరి శ్యామ్, మోర్తాడ్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, వార్డు సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు నచ్చయ్య, అశోక్, సుమన్, ప్రమీల, యువజన సంఘాల సభ్యులు, క్రీడాకారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్:** రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. మండలంలోని గుండారం గ్రామంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాపిరెడ్డి మరణించిన నేపథ్యంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్ తల్లి ఇటీవల మృతి చెందటంతో కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. అలాగే మోపాల్ మండలం బోర్గాం(పి)లో సుదర్శన్‌రెడ్డి తల్లి మృతి చెందటంతో అక్కడి కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వ ఎంట సర్పంచ్‌లు, ఎఎంసి చైర్మన్ గంగారెడ్డి, నాయకులు బాగారెడ్డి, శేఖర్‌గౌడ్, భూమారెడ్డి ఉన్నారు.

